సాక్షి వరంగల్

శుక్రవారం | 22 | సెప్టెంబర్ | 2023

న్యూస్‌రీల్

గో సంపదను కాపాడాలి



రాయపర్తి: గో సంపదను కాపాడుకోవాలని తెలంగాణ గోశాలల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని బంధనపల్లిలో శ్రీ బాలాజీ గోశాల ఆధ్వర్యంలో రైతులకు లేగ దూడలు పంపిణీ చేశారు. మహేష్‌అగర్వాల్ మాట్లాడుతూ రైతులు గోవులను పెంచడం వల్ల పేడ, మూత్రంతో సేంద్రియ వ్యవసాయం చేసి ఆరోగ్యదాయకమైన పంటలను పండించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటిండెంట్ దుర్గం రోజా, సర్పంచ్ దీప్లానాయక్, శ్రీనివాస్, రాజేష్, లావుడ్య రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు నమోదు

నెక్కొండ: ఓటరు నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా జాబితా ఉండాలని నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి అన్నారు. మండలంలోని పనికర, చంద్రుగొండ గ్రామాల్లో గురువారం ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ పరిశీలించారు. జాబితాలో రెండుసార్లున్న పేర్లు, మృతిచెందిన వారి పేర్లను గుర్తించారు. బీఎల్‌ఓలు ఓటరు జాబితాలో తప్పులు దొర్లకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఆర్‌ఐ నరేందర్, సర్వేయర్ కుశల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక



వర్ధన్నపేట: మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ ఎస్‌ఎస్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థినులు కాల్వ నందిని, చెలకలపల్లి హిందు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు అనుమాసు వేణు గురువారం తెలిపారు. ఈ నెల 22 నుంచి 24 వరకు హైదరాబాద్‌లోని పిరమిడ్ స్పిరిచ్వల్ సెంటర్, కై లాసపురంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థినులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను హెచ్‌ఎం వేణుతోపాటు ఉపాధ్యాయులు ఉషారాణి, ఎ.రాజు, పి.లలిత్‌కుమార్, జి.విజయ్, ఎం.రాజు, సీహెచ్ అరుణదేవి, బి.వీరస్వామి, ఎండీ జావీద్ అభినందించారు.

టార్గెట్ బాల్ రాష్ట్ర జట్టు కోచ్‌గా రవికుమార్



నర్సంపేట/నర్సంపేట రూరల్ : మహారాష్ట్ర షిర్డీలో అక్టోబర్ 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరిగే నాల్గో జాతీయ స్థాయి సబ్ జూనియర్ టార్గెట్ బాల్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర బాలుర జట్టుకు అశోక్‌నగర్ గ్రామానికి చెందిన యాట రవికుమార్‌ను తెలంగాణ రాష్ట్ర టార్గెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ రాజేంద్రప్రసాద్, అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, సెక్రటరీ రేవంత్‌లు కోచ్‌గా నియమించారు. జిల్లా క్రీడా సంఘాల బాధ్యులు, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ రూల్స్, రెగ్యులేషన్స్ కమిటీ కన్వీనర్, జిల్లా టార్గెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఇన్ ఎస్‌ఆర్ యూనివర్సిటీ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్, గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ వేములపల్లి సుబ్బారావు, జిల్లా టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయిడి దుశ్యంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గుండేటి రవీందర్‌గౌడ్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు గూడెపు భిక్షపతిలు తదితరులు రవికుమార్‌ను గురువారం అభినందించారు. కార్యక్రమంలో కందుల స్వామిగౌడ్, సారంగపాణి, రామదాస్, నాగరాజుగౌడ్, లక్ష్మయ్య, కొత్త మల్లయ్యగౌడ్, భాస్కర్, కొమ్మాలు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల షెడ్యూల్ విడుదల

వరంగల్ లీగల్: ఉమ్మడి జిల్లా న్యాయవాదుల పరస్పర సహాయక సహకార సంఘంలోని నాలుగు డైరెక్టర్ల స్థానాల ఎన్నికల కోసం సొసైటీ కార్యదర్శి వి.రాజ్‌కర్ణాకర్ గురువారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 25న సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల దాఖలు, 25న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, సాయంత్రం 4 గంటలకు పోటీలో ఉండే అభ్యర్థుల వివరాలు ప్రకటిస్తామని కార్యదర్శి తెలిపారు. 29న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, అదేరోజు ఓట్ల లెక్కింపు నిర్వహించి విజేతలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

'తూర్పు'లో 'హస్త'వాసి ఎవరో..?

కొండా సురేఖ, ఎరబ్రెల్లి స్వర్ణ, సామల ప్రదీప్ కుమార్ ప్రయత్నాలు

- ఓవైపు రాజకీయ అనుభవం, మరోవైపు సామాజిక సేవ కలిసొస్తుందనే లెక్కలు
- ఢిల్లీలో స్క్రీనింగ్ కమిటీ భేటీతో ఎవరికి వారుగా లాబీయింగ్
- ఇటీవల కొండా వ్యాఖ్యలతో నియోజకవర్గంలో కన్ఫ్యూజన్‌పై చర్చ
- సాధ్యమైనంత త్వరగా టికెట్ ఖరారు చేస్తే జనాలతో ఇంకా మమేకం



సామల ప్రదీప్

సాక్షి, వరంగల్: వరంగల్ తూర్పు కాంగ్రెస్‌లో పొలిటికల్ హీట్ పెరిగింది. ఇప్పటికే ఆరు గ్యారంటీ స్కీంలతో జనాల్లోకి వెళుతున్న ఆ పార్టీ నాయకులు ఎవరికి వారుగా టికెట్ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఇక్కడినుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ మంత్రి కొండా సురేఖ గత ఎన్నికల్లో పరకాల నుంచి పోటీ చేసినా... ఇప్పుడు మళ్లీ వరంగల్ తూర్పు నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అదే సమయంలో డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ కూడా ఎప్పటినుంచో పార్టీని అంటిపెట్టుకొని ఉన్నానని, అవకాశం తనకే ఇవ్వాలంటూ దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా ఇండియన్ ఓవర్ సీస్ కాంగ్రెస్ యూఎస్‌ఏ వర్కింగ్ ప్రెసిడెంట్ సామల ప్రదీప్ కొన్నేళ్లుగా సామల జయశంకర్ ఫౌండేషన్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇటీవల వరంగల్ పార్లమెంట్ స్థానాలపై సమీక్షకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వచ్చిన సమయంలో తనలాంటి గట్టి నేత ఉన్న నియోజకవర్గంలోనే టికెట్‌పై క్లారిటీ లేకపోవడంతో జనాల్లో కన్ఫ్యూజన్ సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలతో ఇక్కడి స్థానం నుంచి పోటీ చేసేందుకు ఎవరికి వారుగా ఎంత గట్టి ప్రయత్నాలు చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.

ఆ ముగ్గురి మధ్య పోటీ ఎక్కువ..

వరంగల్ తూర్పు నుంచి ఎనిమిది మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కొండా సురేఖ, ఎరబ్రెల్లి స్వర్ణ, సామల ప్రదీప్ కుమార్, భవంతుల రాధిక, సయ్యద్ అజ్మతుల్లా హుస్సేని, డాక్టర్ కత్తి వెంకటస్వామి, యంబాడి రవీందర్, బారుపాటి రవీందర్‌లు పోటీ చేస్తామని ముందుకు వచ్చారు. దీనిపై ఇప్పటికే దఫాల వారీగా సర్వేలు చేసిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం... ఢిల్లీలో స్క్రీనింగ్ కమిటీ భేటీ అయి ఫైనల్ చేసే ప్రయత్నాల్లో ఉంది. దీంతో ఆయా అభ్యర్థులు ఎవరికి వారుగా టికెట్ ఫైనల్ చేసుకునేందుకు తమకు దగ్గరైన ముఖ్య నేతల ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కొండా సురేఖ, ఎరబ్రెల్లి స్వర్ణ, సామల ప్రదీప్ కుమార్ ల మధ్య పోటీ ఎక్కువగా ఉన్నట్టుగా పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. ఇప్పటికే కొండా సురేఖ ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఉండడం అదనపు బలం కాగా, నాలుగేళ్లుగా ఏమీ పట్టించుకోకుండా ఇటీవల తిరిగి కార్యక్రమాలు ముమ్మరం చేసినా కూడా ప్రజలను మెప్పించే ప్రయత్నం జరుగుతుందా అన్న చర్చ కూడా ఉంది. ఇంకోవైపు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తాను ఎప్పటి నుంచో పార్టీ కోసం పనిచేస్తున్నానని, గతంలో మేయర్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో పాటు ఇక్కడి నేతలు, ప్రజలతో సత్సంబంధాలు ఉన్నాయనే వాదనను వినిపిస్తున్నారు. సామల ప్రదీప్ కుమార్ వరంగల్ సిటీలో నాలుగేళ్లుగా సామల జయశంకర్ ఫౌండేషన్ ద్వారా కరోనా సమయంలో రోగులకు సలహాలు ఇచ్చేందుకు హెల్ప్‌లైన్ ఏర్పాటుచేయడం, ఎంజీఎంలో అవసరమైన ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు విరాళంగా ఇవ్వడంతోపాటు అవసరార్థులకు ఆహారాన్ని అందించారు. అమెరికాలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు చేసిన సమయంలో అగ్రనేత రాహుల్ గాంధీతో ఏర్పడిన పరిచయం కూడా తనకు ప్లస్ అవుతుందన్న నమ్మకంతో ఉన్నారు. ఇలా తూర్పులో ఈ ముగ్గురి మధ్య పోటీ ఎక్కువగా ఉండడంతో ఎవరిని టికెట్ వరిస్తుందోనన్న చర్చ కాంగ్రెస్ పార్టీలో జోరుగా సాగుతోంది. ఈ నెలాఖరు వరకు దీనిపై స్పష్టత రానుంది. సాధ్యమైనంత తొందరగా టికెట్ ప్రకటిస్తే ఇటు పార్టీ శ్రేణులు, అటు ప్రజలను కలుపుకొని పోయే అవకాశం ఉందని ఆశావహులు అంటున్నారు.

ఆధ్యాత్మికతకు పెద్దపీట



ధార్మిక భవన్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, దయాకర్‌రావు, సత్యవతి తదితరులు

ఆలయాల అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- రూ.4.16 కోట్లతో నిర్మించిన ధార్మిక భవన్ ప్రారంభం



పూజలో పాల్గొన్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, వినోద్‌కుమార్, తదితరులు

వరంగల్ : దేవాలయాల అభివృద్ధి, ఆధ్యాత్మికతకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. భద్రకాళి ఆలయ సమీపంలో రూ.4.16 కోట్లతో నిర్మించిన ధార్మిక భవన్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమీకృత దేవాదాయశాఖ కార్యాలయంలో ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, మేడారం సమ్మక్క–సారలమ్మ ఈఓ, ఇంజనీరింగ్ కార్యాలయాలు ఉంటాయని పేర్కొన్నారు. తెలంగాణ మల్టీజోన్ పరిధిలోని 19 జిల్లాల్లో ఉన్న దేవాలయాలు ధార్మిక భవన్ పరిధిలోకి వస్తాయన్నారు. మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని దేవాలయాలను పర్యవేక్షించే కార్యాలయం హైదరాబాద్ తర్వాత వరంగల్‌లో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌తోనే ఆలయాలు అభివృద్ధికి నోచుకున్నాయని వివరించారు. ప్రపంచ వారసత్వ సంపదగా రామప్ప గుర్తింపు పొందేందుకు ఎంతో శ్రమించామని గుర్తుచేశారు. మాడ వీధుల నిర్మాణానికి మంచి ప్లాన్ గీయించాలని అధికారులను ఆదేశించారు. సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సహకారంతో పాలకుర్తి నియోజకవర్గంలో ఆలయాలు అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. శిథిలావస్థలో ఉన్న కాకతీయుల ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని మంత్రి, అధికారులను కోరారు. చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ భద్రకాళి ఆలయాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేయాలని, మాడ వీధులతో సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, మేయర్ గుండు సుధారాణి, ఎండోమెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, కుడా చైర్మన్ ఎస్.సుందర్‌రాజ్, హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్, కమిషనర్ షేక్‌రిజ్వాన్‌బాషా, వరంగల్ జోన్ డీసీ శ్రీకాంతరావు, ఏసీ సునీత, ఈఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

కల్యాణ మండపం త్వరగా పూర్తయ్యేలా కృషి

హన్మకొండ కల్చరల్ : వేయిస్తంభాల దేవాలయం కల్యాణ మండపం పునర్నిర్మాణ పనులు పురావస్తు శాఖ పరిధిలో ఉన్నందున వారితో చర్చించి త్వరగా పూర్తయ్యేలా కృషి చేస్తానని దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం నగరపర్యటనలో భాగంగా వేయి స్తంభాల దేవాలయం, భద్రకాళి ఆలయాలను నాయకులతో కలిసి సందర్శించారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

నరేందర్ అభ్యర్థిత్వం మార్చండి!

లేకుంటే పార్టీ మారుతాం

- తూర్పు ఎమ్మెల్యే ఒంటెద్దు పోకడలతో విసిగిపోయాం
- 13 మంది కార్పొరేటర్ల రహస్య మంతనాలు
- సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు ఫిర్యాదు చేయాలని నిర్ణయం?


సాక్షి, వరంగల్ : బీఆర్‌ఎస్ వరంగల్ తూర్పు అభ్యర్థి నన్నపునేని నరేందర్‌ను మార్చకుంటే తాము పార్టీ మారేందుకు కూడా వెనుకాడేదిలేదని అధికార పార్టీకి చెందిన మెజారిటీ కార్పొరేటర్లు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు ఫిర్యాదు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. సామాజిక మధ్యమాల్లో ఈ విషయం వైరల్ కావడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. అల్పాహారానికి గురువారం తూర్పులోని అధికార పార్టీ కార్పొరేటర్ తన ఇంటికి పలువురు కార్పొరేటర్లను ఆహ్వానించారు. ఒక పీఏసీఎస్ చైర్మన్, 13 మంది కార్పొరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు తమ ఇబ్బందులను వెల్లడించినట్లు తెలిసింది. పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చుపెట్టి గెలిస్తే తమ డివిజన్లలో ఎలాంటి అధికారం, గౌరవం లేదని వాపోయారు. డివిజన్ కమిటీల పేరుతో ఎమ్మెల్యే తన అనుచరులను నియమించి అభివృద్ధి, పార్టీ కార్యక్రమాలను వారితో నిర్వహిస్తుంటే తమను కార్పొరేటర్లుగా ప్రజలు గుర్తించడం లేదని ప్రస్తావించినట్లు తెలిసింది. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తే ప్రజల ముందే అవహేళనగా మాట్లాడుతుంటే ఎలా భరించాలని కొందరు పేర్కొన్నట్లు సమాచారం.

గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారు ఎవరు కూడా కార్పొరేటర్లను ఇంత హీనంగా చూడలేదని, ప్రస్తుత ఎమ్మెల్యేను కాదని ఏదైనా కార్యక్రమం చేపడితే తర్వాత పోలీసులతో వేధింపులకు గురిచేస్తున్నాడని, ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ఉదహరించినట్లు వినికిడి. ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితంగా ఉండే ఒక కార్పొరేటర్ మరోసారి ఆయన దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్దామని సలహా ఇవ్వడంతో సదరు కార్పొరేటర్‌పై మిగిలిన కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మరోసారి చెప్పి చూద్దాం.. లేకుంటే మీతో పాటు నేను కూడా కలిసి వస్తా'నని హామీ ఇవ్వగా.. మిగిలిన వారు సరే అంటూ చివరిగా అవకాశం ఇద్దామన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. సీఎం కేసీఆర్ అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిద్దామని, వీలుకాకుంటే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్, హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ సమావేశంపై పోలీసు నిఘా బృందాలు సైతం నివేదికలను ప్రభుత్వానికి పంపగా.. బీఆర్‌ఎస్ అధిష్టానం సైతం ఆరా తీస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

రుణాలను వినియోగించుకోవాలి

ఐనవోలు: నందనం సొసైటీ ఆధ్వర్యంలో అందిస్తున్న రుణాలను కర్షకులకు వినియోగించుకోవాలని డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సూచించారు. నందనం రైతు సేవా సహకార సంఘం ద్వారా కర్షకమిత్ర మార్టిగేజ్ లోన్లను గురువారం ఐదుగురు రైతులకు అందజేసి, మాట్లాడారు. బ్యాంకు ద్వారా పంట, బంగారం తనఖా రుణాలతో పాటు వ్యవసాయ భూమి మార్టిగేజ్ రుణాలను అందజేస్తున్నట్లు తెలిపారు.

బూర్జువా పార్టీల హామీలతో మోసపోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

నర్సంపేట: బూర్జువా భూస్వామ్య పార్టీల ఎన్నికల హామీలకు మోసపోవద్దని, మద్దికాయల ఓంకార్ ఆశయ సాధనలో ముందుకు సాగాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని జ్యోతిబసునగర్‌లో గురువారం జనరల్ బాడీ సమావేశం బండారి మల్లేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. దేశంలో మహిళలకు రక్షణలేకుండా పోయిందన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఏర్పడిన చట్ట సభలను అవకాశవాద అవినీతి కర రాజకీయాలుగా మార్చారని ఆరోపించారు. కోట్లాది రూపాయల అప్పులు తెచ్చి కాంట్రాక్టర్లు, పెట్టుబడిదారులకు కట్టబెడుతూ అప్పులు మిగుల్చుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రమజీవుల కోసం పని చేసి అసెంబ్లీ టైగర్‌గా పేరుగాంచిన మద్దికాయల ఓంకార్ చూపిన మార్గంలో ప్రజలు పయనించాలన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ వంగల రాగసుధ, పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు కుక్కల యాకయ్య, మోటం సురేష్, నాయకులు గడ్డం స్వరూప, ఈర్ల రాజు, సతీష్‌బాబు, సుభద్ర, మొగిలి, దేవమ్మ, నిర్మల, ఐలమ్మ, లావణ్య, అచల, యాకయ్య, ఖాజా పాల్గొన్నారు.

వినాయకుడికి దోమ'తెర'!



ఎలుకుర్తిహవేలి గ్రామంలో కోతుల బెడదకు వినాయకుడే జంకుతున్నాడు..! అవునండీ.. స్థానికంగా ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం వద్దకు నిత్యం కోతులు వచ్చి ఇష్టారీతిన ప్రవర్తిస్తుండడంతో నిర్వాహకులు ఏకంగా దోమరతెరను అడ్డుగా కట్టి గణపయ్యను కాపాడుతున్నారు.

– గీసుకొండ

నిర్దేశిత లక్ష్యాలు సాధించాలి

- వ్యవసాయ, ఉద్యానవన శాఖ సమీక్ష సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య



ఓటరు నమోదు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఖిలా వరంగల్: నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో సాధించాలని కలెక్టర్ ప్రావీణ్య వివిధ బ్యాంకు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో రైతు రుణమాఫీ, వివిధ బ్యాంకులకు నిర్దేశించిన లక్ష్యాల సాధింపుపై గురువారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు. రైతు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయా.. లేదా.. పంట రుణాలు రెన్యూవల్ చేసుకున్నారా.. లేదా.. అనే విషయాన్ని వ్యవసాయ క్షేత్రస్థాయి అధికారులు పర్యవేక్షించి నివేదికలు సమర్పించాలన్నారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని, ఎరువుల నిల్వ నివేదికలను పరిశీలించి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ఉద్యానవన శాఖ పర్యవేక్షణలో ఆయిల్ పామ్ తోటల పెంపకంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. 700 ఎకరాలకు మంజూరు ఇచ్చినట్లు తెలిపారు. అక్టోబర్ 1 నుంచి 15 వరకు 125 ఎకరాల్లో రైతులను గుర్తించి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. ప్రతి 1,000 ఎకరాలకు ఒక ఫీల్డ్ ఆఫీసర్ ఉండాలని, 13 మండలాలకు 13 మంది ఉండేలా చూసుకుని శాఖాపరమైన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. రాబోయే యాసంగి పంటలకు అక్టోబర్ 15వరకు రైతుల నుంచి దరఖాస్తులు, రైతు వాటాను డీడీ రూపంలో చెల్లించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఉషాదయాళ్ మాట్లాడారు. జిల్లాలో వానాకాలం సీజన్‌కు సంబంధించి 2,800 ఎకరాలకు గాను ఇప్పటి వరకు 1,450 మొక్కలు గ్రౌండింగ్ అయ్యాయని, 2,100 ఎకరాలకు పరిపాలన అనుమతులు ఇచ్చామని తెలిపారు. 700 ఎకరాలకు సంబంధించిన రైతు దరఖాస్తులు, నాన్ సబ్సిడీ నిధులను సేకరించాలని మండల ఉద్యానవన శాఖ అధికారులు, కంపెనీల ప్రతినిధులను కోరారు. సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రాజు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

వర్ధన్నపేట: వర్ధన్నపేట మున్సిపల్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. వర్ధన్నపేట మున్సిపల్ పరిధిలో టీయూఎఫ్‌ఐడీసీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ గురువారం పరిశీలించారు. అంబేడ్కర్ జంక్షన్, ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, వైకుంఠ ధామం, దోబీఘాట్, మున్సిపల్ భవన నిర్మాణం తదితర వాటిని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయన్నారు. పనులు వేగంగా.. నాణ్యతగా చేయాలని ఆదేశించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని, ఓటరు జాబితాలో లేని పక్షంలో నమోదు చేసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ఓటర్ సవరణ వివరాలను పరిశీలించారు. వర్ధన్నపేట ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకాడే, మున్సిపల్ చైర్ పర్సన్ అరుణ, వైస్ చైర్మన్ ఎలేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జోనా పాల్గొన్నారు.

ఓటరు జాబితా వేగంగా రూపొందించాలి

ఓటరు జాబితా రూపకల్పనలో వేగం పెంచాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం ఖిలా వరంగల్ తహసీల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఫారం 6, 7, 8 దస్త్రాల ప్రక్రియను పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం శివనగర్‌లోని 110, 118, 120, 167, 170, 186 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నాగేశ్వరరావుతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఆయా బూత్‌లలో బీఎల్‌ఓలు నమోదు చేసిన ఫారం 6, 7, 8ల రిజిష్టర్లను కలెక్టర్ పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బల్దియాకు ఇండిగ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డు

వరంగల్: ఇండిగ్లోబల్ ఎక్సలెన్స్ అవార్డు– 2023కు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎంపికైనట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈనెల 22, 23 తేదీల్లో వర్చువల్‌గా ఢిల్లీ నుంచి అవార్డు అందజేయనున్నట్లు సంస్థ ప్రతినిధులు గురువారం తెలిపారు. అమ్మవారిపేటలో మల, బురద ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్‌ఎస్‌టీపీ), శానిటేషన్ రిసోర్స్ పార్కు అభివృద్ధి చేసినందుకు ఇండిగ్లోబల్ సంస్థ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేసినట్లు బల్దియా అధికారులు పేర్కొన్నారు. గ్రేటర్ అవార్డుకు ఎంపిక కావడంపై మేయర్ గుండు సుధారాణి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవార్డు రావడానికి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, జిల్లా మంత్రులు, ప్రభుత్వ చీఫ్‌విప్, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, బల్దియా కమిషనర్, అధికారులు సహకారం అందించారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మూడేళ్ల క్రితమే అమ్మవారిపేటలో ఎఫ్‌ఎస్‌టీపీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే అరూరి రమేశ్



రైతుకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అరూరి రమేష్

వర్ధన్నపేట: రాష్ట్రంలో రైతు సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని ఇల్లంద శివారులోని ఓ గార్డెన్స్‌లో పంట నష్ట పరిహారం చెక్కులను కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి రమేశ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అనేక రైతు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు భరోసా కల్పించి ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందిస్తున్న గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఏడీఏ సురేష్, ఎంపీపీ అప్పారావు, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆంగోత్ అరుణ, ఆత్మ చైర్మన్ గుజ్జ గోపాల్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ రాజేష్‌ఖన్నా, మార్కెట్ కమిటీ చైర్మన్ స్వామిరాయుడు, అల్లమనేని మోహన్‌రావు, చొప్పరి సోమలక్ష్మి సోమయ్య, రాంనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

24న ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

హనుమకొండ: హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ 24వ తేదీన ఉమ్మడి జిల్లా స్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ వీరయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 30 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిజామాబాద్‌లో నిర్వహించే 42వ రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. జనవరి 02, 2008 తర్వాత జన్మించిన వారై ఉండి ఆసక్తి గల బాలబాలికలు 24న ఉదయం 9గంటలకు జేఎన్ఎస్‌లోని బ్యాడ్మింటన్ కోర్టు వద్ద తనకు రిపోర్టు చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అవుతారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 98492 01467 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కుంటలో పడి పశువుల కాపరి మృతి

బయ్యారం: ఓ పశువుల కాపరి కుంటలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వినోభానగర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన కొండమీది మల్లయ్య(60) పశువులకాపరిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం మేత నిమిత్తం పశువులను గ్రామ సమీపంలోని జీవికుంట వద్దకు తీసుకెళ్లాడు. కుంటలో దిగిన పశువులు బయటకు రావడం లేదు. దీంతో పశువులను బయటకు తీసుకొచ్చేందుకు కుంటలో దిగాడు. ఈ క్రమంలో కుంటలోని దామెరతీగ చుట్టుకోవడంతో మునిగిపోయాడు. రాత్రి అయిన మల్లయ్య ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం ప్రయత్నించగా గురువారం కుంటలో మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఉపేందర్ తెలిపారు.

మున్నేరువాగులో ఒకరి గల్లంతు



వెంకన్న

మహబూబాబాద్ రూరల్ : మున్నేరువాగులో ఒకరు గల్లంతయ్యారు. ఈ ఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి జమాండ్లపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన మోడెం వెంకన్న (35) మేస్త్రీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం పనిలేకపోవడంతో గ్రామ శివారులోని మున్నేరువాగు వద్దకు చేపల వేటకు వెళ్లాడు. అనంతరం అక్కడే ఉన్న పృథ్వీ అనే వ్యక్తితో కలిసి మున్నేరువాగు చెక్ డ్యాం మీదుగా అవతలి వైపున ఉన్న గాంధీపురం గ్రామ శివారు వరకు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో చెక్ డ్యాం మీది నుంచి వాగులో పడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. స్థానికులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు.

నిలువెత్తు నిర్లక్ష్యం..

తడిసిన సింథటిక్ ట్రాక్‌పైనే అథ్లెటిక్స్ పోటీలు
- ఇబ్బందులు పడిన క్రీడాకారిణులు
- వర్షంలోనే భోజనం.. తడుస్తూ క్యూలైన్‌లో అన్నం కోసం బారులు
- నిర్వాహకుల పనితీరుపై అసహనం
- కనీస వసతుల కల్పనలో అలసత్వం



వర్షంలో తడుస్తూ భోజనం కోసం క్యూలో నిల్చున్న క్రీడాకారిణులు



షూ లేకుండా తడిసిన ట్రాక్‌పై రన్నింగ్ చేస్తున్న క్రీడాకారిణులు

సాక్షిప్రతినిధి, వరంగల్: వర్షంలో తడుస్తూ అన్నం కోసం క్యూలో నిల్చున్న వీరంతా వినాయక మండపం వద్ద భక్తులు కాదు.. అనేక సంవత్సరాల కఠోర సాధన ఫలితంగా వచ్చే ప్రతిభను చాటేందుకు వచ్చిన యువ క్రీడాకారిణులు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కనిపించిన ఈ చిత్రం క్రీడాభిమానులను కలిచివేసింది. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల ఎంతో దూరం నుంచి వచ్చిన క్రీడాకారిణులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కనీస వసతుల కల్పనలో అలసత్వం వహించడంపై సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు నిర్వాహకుల తీరుపై అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు.

జేఎన్ఎస్‌లో పోటీలు

హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో గురువారం తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అచీవింగ్ స్పోర్ట్స్ మైల్‌స్టోన్ బై ఇన్‌స్పైరింగ్ ఉమెన్ త్రు యాక్షన్ (అస్మిత) ఖేలో ఇండియా ఉమెన్స్ లీగ్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అన్ని కేటగిరీల్లో బాలికలు, మహిళలలో ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని మరింత ప్రోత్సహించాలన్నదే అస్మిత ప్రధాన లక్ష్యం. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల క్రీడాకారిణులకు ఒక్క రోజు పోటీలు నిర్వహించాలని అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఏఎఫ్ఐ)కు కేంద్రం సూచించింది. కాగా, ఏఎఫ్ఐ నిర్వహణ బాధ్యతలను అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు అప్పగించింది.

పోటీలను మమ అనిపిస్తే చాలు..

ప్రతిభ, ప్రోత్సాహం పక్కన పెడితే కేవలం పోటీలు నిర్వహిస్తే చాలు అన్నట్లు తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ వ్యవహరించిందని టెక్నికల్ అఫీషియల్స్, సీనియర్ క్రీడాకాఋలు, కోచ్‌లు వాపోయారు. గురువారం ఉదయం 5.30 గంటల నుంచి నగరంలో దాదాపు గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో జేఎన్ఎస్‌లోని సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ తడిసిపోవడంతో పాటు అక్కడక్కడ నీరు నిలిచింది. దీంతో స్కిడ్ అవుతుందని క్రీడాకారులు షూ లేకుండానే పోటీల్లో పాల్గొన్నారు.

తడిసిన ట్రాక్‌పై రన్నింగ్..

తడిసిన సింథటిక్ ట్రాక్‌పై అథ్లెట్లు రన్నింగ్ చేయడానికి ఇబ్బందులు పడ్డారు. వివిధ కేటగిరీల్లో పాల్గొన్న క్రీడాకారిణులకు 100, 200, 400, 800, 1500 మీటర్ల రన్నింగ్‌తో పాటు డిస్కస్ త్రో, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్, ట్రిపుల్‌జంప్, హైజంప్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి సుమారు 600 క్రీడాకారిణులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఖేలో ఇండియా పోటీలు నిర్వహించడం అభినందనీయమని, వచ్చే నెలలో జరిగే సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు హనుమకొండ ఆతిథ్యం ఇస్తుందన్నారు. అనంతరం విజేతలకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అజీజ్ ఖాన్, హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్, అథ్లెటిక్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, సంఘం బాధ్యులు ఐలి చంద్రమోహన్‌గౌడ్, ఎండీ గౌస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న చీఫ్‌విప్



వర్షంలోనే చెట్టు కింద భోజనం చేస్తున్న క్రీడాకారిణులు



షాట్‌పుట్ విసురుతున్న క్రీడాకారిణి

నవంబర్‌లో జాతీయ మహాసభలు

- అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ మహాసభల ఆహ్వాన కమిటీ చైర్మన్ వినోద్ కుమార్



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

హన్మకొండ: అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ మహాసభలు నవంబర్ 19, 20, 21 తేదీల్లో హనుమకొండ వేదికగా జరగనున్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ మహాసభల ఆహ్వాన కమిటీ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు. గురువారం హనుమకొండ కాకతీయ కాలనీలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను పార్లమెంట్ సభ్యుడిగా కొనసాగిన సమయంలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను పలుమార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వాలు గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. అనంతరం జాతీయ మహాసభల వైస్ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ చారిత్రక నగరం హనుమకొండలో జాతీయ మహాసభలు నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి జయరాజు మాట్లాడుతూ సభలకు దేశ వ్యాప్తంగా 3 వేల మంది ప్రతినిధులు హాజరుకానున్నారన్నారు సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాజేందర్ రెడ్డి, హనుమకొండ డివిజన్ కార్యదర్శి బొద్దున వెంకటేశ్వర్లు, కోశాధికారి మర్రి కొమురారెడ్డి, 'కుడా' చైర్మన్ సుందర్ రాజు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అజీజ్ ఖాన్ పాల్గొన్నారు.

డీన్ల పారదర్శకతను తప్పుపట్టడం హాస్యాస్పదం

కేయూ క్యాంపస్: డీన్ల పారదర్శకతను తప్పుపట్టడం హాస్యాస్పదమని కాకతీయ యూనివర్సిటీ ఆల్ ఫ్యాకల్టీ డీన్లు అయిలయ్య, మల్లారెడ్డి, మనోహర్, నర్సింహారెడ్డి, అమరవేణి, రాంనాథ్ కిషన్, విజయలక్ష్మి శ్రీనివాసులు గురువారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్లు పారదర్శకంగానే నిర్వహించామని డీన్లు అందరం ఒక ప్రకటన జారీచేశామని, ఆ ప్రకటన సమాజాన్ని దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా విడుదల చేసిందన్నారు. ఆ ప్రకటనను అపహాస్యం చేస్తూ కేయూ డీన్లు పారదర్శకతను నిరూపించుకోవాలంటూ కేయూ జేఏసీ పేరున విడుదల చేసిన ప్రకటన హాస్యాస్పదంగా ఉందని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. డీన్లు వీసీ చేతిలో కీలుబొమ్మలంటూ జేఏసీ చేసిన ఆ ప్రకటన సరికాదన్నారు. స్వార్థపరుల చేతిలో కీలుబొమ్మలుగా మారి తమ విలువైన కాలాన్ని వృథా చేసుకోవద్దని డీన్లుగా తాము విద్యార్థులకు విన్నవిస్తున్నామన్నారు.

మేడారంలో సకల సౌకర్యాలు

- దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- లోపాలు తలెత్తకుండా జాతర ఏర్పాట్లు చేపట్టాలి : మంత్రి సత్యవతి రాథోడ్
- వీవీఐపీ అతిథి గృహ సముదాయ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన
- మహాజాతర ఏర్పాట్లపై సమీక్ష



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి



ములుగులో వ్యవసాయశాఖ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు

ఎస్ఎస్ తాడ్వాయి/ములుగు రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మేడారంలో తీవ్ర నష్టం వాటిల్లిందని, జాతరకు ముందుగానే మరమ్మతులు పూర్తి చేసి భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. గురువారం మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహంలో మహాజాతర ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.14 కోట్లతో మేడారంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశామన్నారు. పస్రా – మేడారం రోడ్డులో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నట్లు వివరించారు. రూ.12కోట్ల వ్యయంతో ప్రత్యేక గదులు, డార్మెటరీలను నిర్మిస్తున్నామన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే సమ్మక్క సారలమ్మ మహాజాతరలో లోపాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత నాలుగు దఫాలు జరిగిన జాతరలో రూ.400 కోట్లతో భక్తులకు సౌకర్యాలు కల్పించామన్నారు. 2024లో జరిగే జాతరను విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఆరు నెలల ముందు నుంచే జాతర ఏర్పాట్లపై ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఆదివాసీ బిడ్డ నాగజ్యోతిని గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారన్నారు. సీఎం కేసీఆర్.. ములుగు జిల్లాకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. మల్లంపల్లి మండలం, ఏటూరునాగారం డివిజన్ ఏర్పాటుకు త్వరలోనే ఏర్పాట్లు జరగనున్నాయని తెలిపారు. ఈనెల 28న మంత్రి హరీష్‌రావు జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవానికి హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

మేడారానికి వచ్చిన మంత్రులు సత్యవతి రాథోడ్, ఇంద్రకరణ్‌రెడ్డి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హెలీపాడ్ పక్కన స్థలంలో రూ.2.15 కోట్లతో నిర్మించనున్న వీవీఐపీ అతిథి గృహ సముదాయ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అంతకుముందు ములుగు జిల్లాకేంద్రంలో వ్యవసాయశాఖ కార్యాలయం ప్రారంభించారు. ఇంచర్ల జీపీ పరిధిలోని గిరిజన సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో రూ. 5 కోట్లతో నిర్మించనున్న భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, రెడ్కో చైర్మన్ సతీష్‌రెడ్డి, రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, ఎస్పీ గాష్ ఆలం, ఐటీడీఏ పీఓ అంకిత్, ఈఓ రాజేంద్రం, ఎంపీపీ వాణిశ్రీ, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు, సర్పంచ్ శిడం బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

మెస్‌కార్డుల రెన్యూవల్ వివాదం..

- బకాయిలు చెల్లించలేమంటున్న విద్యార్థులు
- కనీసం రూ 2,500 చెల్లిస్తేనే రెన్యూవల్ : హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్య

కేయూక్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పూర్తయి మూడో సెమిస్టర్‌లోకి ప్రవేశించిన విద్యార్థులకు హాస్టల్‌వసతి మెస్‌కార్డుల రెన్యూవల్ ప్రక్రియ మొదలైంది. కాగా, గత విద్యాసంవత్సరానికి సంబంధించి స్కాలర్ షిప్‌లు పోనూ మిగతా బకాయిల్లో కనీసం రూ . 2,500 మరో రూ. 200 మొత్తం రూ. 2,700 చెల్లించి మెస్‌కార్డులు రెన్యూవల్ చేసుకోవాలని కేయూ హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్య కోరుతున్నారు. అయితే తాము మెస్‌బకాయిలు ఇప్పుడు చెల్లించలేమని విద్యార్థులు పేర్కొంటున్నారు. రూ. 200 చెల్లిస్తామని, మెస్ కార్డులు రెన్యూవల్ చేయాలని వారు పట్టుబడుతున్నారు. ఈమేరకు గురువారం హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్యతో వాగ్వావాదానికి దిగారు. స్కాలర్‌షిప్‌లు పోనూ రూ. 8వేల నుంచి రూ. 10వేల వరకు మెస్‌బకాయిలు చెల్లించాల్సిన విద్యార్థులున్నారని, అందుకే అందులో కనీసం రూ. 2,500 చెల్లించాలని డైరెక్టర్ విద్యార్థులతో పేర్కొన్నారు. కనీసం వందమంది విద్యార్థులు మెస్‌కార్డులు రెన్యూవల్ చేసుకుంటేనే క్యాంపస్‌లోని కామన్ మెస్ ఓపెన్ చేస్తామని డైరెక్టర్ వెంకయ్య తెలిపారు. కాగా, మహిళా హాస్టల్ విద్యార్థినులకు మెస్‌బిల్లులు కొంత తక్కువగా వస్తున్నాయి. దీంతో ఆయా విద్యార్థినుల బకాయిలు తక్కువ ఉన్నాయి. స్కాలర్‌షిప్‌లు పోనూ బకాయిలు చెల్లించి ఇప్పటివరకు 60నుంచి 70మంది వరకు రెన్యూవల్ చేసుకున్నారు. దీంతో వారికి గురువారం నుంచి మెస్ సౌకర్యం కల్పిస్తున్నారు.

'తానా' సాహిత్య సదస్సుకు లావణ్య



లావణ్య

జనగామ : అంతర్జాతీయ స్థాయిలో జరుగనున్న సదస్సుకు జనగామ జిల్లా కేంద్రానికి చెందిన కవయిత్రి బుద్దా లావణ్య ఎంపికయ్యారు. తానా (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన అంతర్జాతీయ శతాధిక కవయిత్రుల సమ్మేళనంలో భాగంగా 'నారీ సాహిత్య భేరీ' నిర్వహించనున్నారు. ఇందులో జనగామకు చెందిన కవయిత్రి బుద్దా లావణ్య తన ప్రతిభ చాటుకోనున్నారు. ప్రపంచంలోని 15 దేశాల నుంచి పోటీ పడుతుండగా, దేశం నుంచి కేవలం 20 మంది కవయిత్రులను మాత్రమే ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బుద్దా లావణ్య గురువారం విలేకరులతో మాట్లాడుతూ తానా సంఘం.. ఔత్సాహిక రచయితలను ప్రోత్సహించేలా కృషి చేస్తోందన్నారు. అంతర్జాతీయ వేదికపై తనకు అవకాశం వచ్చేలా కృషి చేసిన తెలుగు వెలుగు సాహిత్య వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మోటూరి నారాయణరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, కవయిత్రి లావణ్యను జరసం అధ్యక్షుడు అయిలా సోమనర్సింహాచారి, కవులు కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు జి.కృష్ణ, కవి హృదయం సాహిత్య వేదిక అధ్యక్షుడు పెట్లోజు సోమేశ్వరాచారి, తెరసం జిల్లా అధ్యక్షుడు పానుగంటి రామమూర్తి, తెరవే రాష్ట్ర కార్యదర్శి జోగు అంజయ్య, తానా సమన్వయ కర్త చిగురుమళ్ల శ్రీనివాస్, అధ్యక్షుడు నిరంజన్, నిర్వాహకుడు తోటకూర ప్రసాద్ అభినందించారు.

జూనియర్ సివిల్ జడ్జిల నియామకం, బదిలీ

వరంగల్ లీగల్ : రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ సివిల్ జడ్జిల బదిలీలు, ఖాళీ పోస్టులను భర్తీ చేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ (విజిలెన్స్) గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బదిలీ చేసిన ఇద్దరు జడ్జిల స్థానాలతో పాటు ఖాళీగా ఉన్న ఐదు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు న్యాయమూర్తులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ జూవెనైల్ కోర్టు జడ్జి నేరెళ్ల వెంకటహైమా పూజితను జోగులాంబ గద్వాల పీడీఎం కోర్టు జడ్జిగా బదిలీ చేస్తూ, ఆ స్థానంలో నందికొండ రితికాను నియమించారు. జనగామ జూవెనల్ కోర్టు జడ్జి సీహెచ్ నర్మదను రంగారెడ్డి జిల్లా ఎల్‌బీ నగర్ కోర్టుకు బదిలీ చేయగా, ఆ స్థానానికి కొప్పుల సందీపను నియమించారు. ఖాళీగా ఉన్న వరంగల్ రెండో మున్సిఫ్ కోర్టు జడ్జిగా బి.వెంకటచంద్ర ప్రసన్న, మూడో మున్సిఫ్ కోర్టు జడ్జిగా ఎ.హరికాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ జిల్లాలో ఖాళీగా ఉన్న నాలుగో మున్సిఫ్ కోర్టు జడ్జిగా మహ్మద్ ఫరిహాఅహ్మద్, పీసీఆర్ కోర్టు జడ్జిగా చెన్ను లీలా నాగసుస్మితను నియమించారు. జయశంకర్‌భూపాలపల్లి జిల్లా జువెనల్ కోర్టు జడ్జిగా గంగినేని అఖిలను నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎల్‌ఎల్‌ఎం పరీక్ష ఫీజు చెల్లించాలి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఎల్‌ఎల్‌ఎం రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 30 వతేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించాలన్నారు. రూ 250 అపరాధ రుసుముతో అక్టోబర్ 4వతేదీ వరకు గడువు ఉందన్నారు.

ఎల్‌ఎల్‌బీ మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు

కేయూ పరిధిలో ఎల్‌ఎల్‌బీ మూడేళ్ల రెండో సెమిస్టర్, నాలుగో సెమిస్టర్ పరీక్షల టైంటేబుల్‌ను విడుదల చేసినట్లు పరీక్షల విభాగం అధికారులు మల్లారెడ్డి, రాధిక తెలిపారు. రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25, 27, 30, అక్టోబర్ 4, 6 వతేదీల్లో జరుగుతాయని తెలిపారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 29, అక్టోబర్ 3, 5, 7వ తేదీల్లో జరుగుతాయని తెలిపారు.

ఐదేళ్ల 'లా' కోర్సు రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు

కేయూ పరిధిలో ఐదేళ్ల 'లా' కోర్సు రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25,27, 30, అక్టోబర్ 4వ తేదీల్లో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 29, అక్టోబర్ 3, 5వతేదీల్లో జరుగుతాయి. వివరాలు కేయూ వెబ్ సైట్‌లో పొందుపరిచామని పరీక్షల నియంత్రణాధికారులు తెలిపారు.

ఉడుమును పట్టుకున్న యువకుడు.. కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్ : మూగజీవి ఉడుమును పట్టుకుని ఉన్న ఓ యువకుడి ఫొటోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. దీంతో అటవీ శాఖ అధికారులు.. ఆ యువకుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు గురువారం అటవీ శాఖ మహబూబాబాద్ రేంజ్ కార్యాలయంలో డోర్నకల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి రేణుక కేసు వివరాలు వెల్లడించారు. కురవి మండలానికి చెందిన జీ రఘు తన చేతిలో ఓ ఉడుమును పట్టుకుని ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆ ఫొటోలను 'ఎనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' సభ్యుడు గౌతమ్ అటవీ శాఖ ఉన్నతాధికారులకు పంపించి ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు డోర్నకల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి రేణుక, సెక్షన్ అధికారి శ్రీనివాస్ .. రఘును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

విహారం.. విషాదం..

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న కారు
- ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం
- నలుగురికి తీవ్ర గాయాలు



నిస్సి (ఫైల్)

ములుగు రూరల్ /కాజీపేట అర్బన్: వరంగల్ నిట్ విద్యార్థుల విహారయాత్ర విషాదమైంది. పర్యాటక ప్రాంతాలను సందర్శించి తిరుగు ప్రయాణమైన వారి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పక్కన ఆగి ఉన్న లారీ కిందికి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి మృతిచెందగా, మరో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున ములుగు మండలం జంగాలపల్లిలో జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ముర్తూజా, ఉమర్, సాయి, సుజిత్, ఏపీలోని విజయవాడకు చెందిన శ్రేయ, తాడేపల్లిగూడేనికి చెందిన నిస్సి సిజు.. వరంగల్ నిట్‌లో బీటెక్ సివిల్ ఇంజనీరింగ్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ములుగు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. తిరుగు ప్రయాణంలో ములుగు మండలం జంగాలపల్లిలో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో కారులో ఉన్న ఆరుగురు విద్యార్థుల్లో నిస్సి సిజు (19) అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనను చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ రంజిత్ కుమార్, ఎస్సై వెంకటేశ్వర్ వెంటనే ఘటనా స్థలికి చేరుకొని క్షతగాత్రులను 108లో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. సాయి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. మిగతా విద్యార్థులు శ్రేయ, ముర్తుజ, ఉమర్, సుజిత్‌కు తీవ్ర గాయాలు కావడంతో హనుమకొండలోని రోహిణి ఆస్పత్రికి తరలించారు. నిస్సి మృతదేహాన్ని ములుగు ఏరియా ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. కాగా, రోడ్డు ప్రమాదంలో ఫ్రెండ్ మృతి చెందిన విషయం తెలుసుకొని నిట్ విద్యార్థులు ములుగు ఏరియా ఆస్పత్రికి వచ్చి బోరున విలపించారు. మృతురాలి కుటుంబ సభ్యుల రోదనలు పలువురిని కంటతడికి గురి చేశాయి. కాగా, బాధిత కుటుంబాలను మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజ్మీరా ప్రహ్లాద్ పరామర్శించారు.

ఏడు నెలలు గడవకముందే..

నిట్ వరంగల్‌కు చెందిన థర్డ్ ఇయర్ విద్యార్థి రిత్విక్ ఏడు నెలల క్రితం క్యాంపస్ నుంచి రాత్రి పది గంటలకు బయలుదేరి ఆరెపల్లి ప్రాంతంలోని వంగపహాడ్ దగ్గర బైక్‌పై ప్రయాణిస్తూ ప్రమాదంలో మృతి చెందాడు. రిత్విక్ మృతి చెంది ఏడు నెలలు గడవకముందే నిట్‌కు చెందిన మరో ఆరుగురు విద్యార్థులు కారు యాక్సిడెంట్‌కు గురికావడం.. ఇందులో ఒకరు మృతి చెందడం పలువురిని కంటతడికి గురి చేసింది.

ఇలా జరుగుతుందని అనుకోలేదు..




నేను, నా మిత్రులు ముర్తుజా, ఉమర్, సాయి, శ్రేయ, నిస్సి ఫుడ్ కోసం హనుమకొండ బాలసముద్రంలోని ఓ హోటల్‌కు వెళ్లాం. అక్కడ ఆలస్యం కావడంతో సరదాగా కారులో లక్నవరం బయలుదేరాం. కానీ రోడ్డు ప్రమాదం అవుతుందని, మాకు ఇలా జరుగుతుందని అనుకోలేదు. గురువారం తెల్ల వారుజామున చోటుచేసుకున్న ప్రమాదంలో అసలేం జరిగిందో అర్థం కాలేదు. లారీ ఒక్కసారిగా ఓవర్ టేక్ చేయడంతో కారు నడిపే మా స్నేహితుడికి ఏం చేయాలో తెలియలేదు.

-సుజిత్, నిట్ విద్యార్థి

రోజూ బయటకు ఎందుకు..?

నిట్ క్యాంపస్‌లో 6వేల మంది విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు క్లాస్ రూంలు, ల్యాబ్స్, సెమినార్ హాల్స్ ఉన్నాయి. అలాగే, భోజనం, వసతికి బాలురకు 1కే,1.8కే, బాలికలకు న్యూ,ఓల్డ్ బ్లాక్, ప్రియదర్శిని బ్లాక్‌ల్లో వసతి ఏర్పాట్లకు గాను కళాశాల ఫీజుతోపాటు మెస్‌కు గాను ఏడాదికి రూ. 14వేలు తీసుకుంటున్నారు. రోజూ ఉదయం టీ, టిఫిన్, లంచ్, డిన్నర్, స్నాక్స్ అందిస్తుంటారు. ఇలా రోజూ అందిస్తున్నా ఫుడ్ కోసం విద్యార్థులు బయటకు ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించే నాథులే లేకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా నిట్ యాజమాన్యం విద్యార్థులకు భద్రత కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



నుజ్జునుజ్జయిన కారును తొలగిస్తున్న పోలీసులు